క్లుప్తంగా

అప్రమత్తంగా ఉండండి



కూలిన ఇంటిని పరిశీలిస్తున్న ఆర్ఐ ఫెరోజ్

రేగోడ్(మెదక్): భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ ఆర్ఐ ఫెరోజ్ సోమవారం తెలిపారు. వర్షానికి రేగోడ్‌లో రెండు గృహాలు, పెద్దతండాలో ఒక ఇల్లు కూలిపోయాయని చెప్పారు. పాత గృహాల్లో ఉండకూడదని, విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని సూచించారు.

తొనిగండ్లలో పుల్చేరు కుంటకు గండి



గండిని పరిశీలిస్తున్న మెదక్ ఆర్డీవో రమాదేవి, అధికారులు

రామాయంపేట(మెదక్): రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో మండలంలోని తొనిగండ్ల గ్రామశివారులో ఉన్న పుల్చేరు కుంటకు గండి పడింది. సోమవారం ఉదయం కుంట వద్దకు వెళ్లిన గ్రామస్తులు కుంట కట్టపై పడ్డ గండిని చూసి, అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మాజీ ఎంపీటీసీ నాగులు ఆధ్వర్యంలో గ్రామస్తులు గండిని పూడ్చి వేశారు. మెదక్ ఆర్డీవో రమాదేవి, మండల తహసీల్దార్ రజనికుమారి, నీటి పారుదల శాఖ ఏఈ కుషాల్, ఇతర అధికారులు కుంటగండిని పరిశీలించారు.

రైతుబీమా చెక్కు అందజేత



చెక్కును అందిస్తున్న నాయకులు

మనోహరాబాద్(తూప్రాన్): అనారోగ్యంతో మృతి చెందిన రైతు కుటుంబానికి నాయకులు రైతుబీమా చెక్కును అందజేశారు. సోమవారం మండలంలోని పర్కిబండ గ్రామ పంచాయతీ పరిధిలోని తుపాకులపల్లి గ్రామానికి చెందిన తూంకుంట దశరథ కుటుంబ సభ్యులకు రూ.5లక్షల రైతుబీమా చెక్కును బీఆర్ఎస్ నాయకులు శ్రీరాం అందజేశారు. కార్యక్రమంలో మంచ నర్సింలు, నర్సింలు, ఆంజనేయులు, మల్లేశ్, మహేశ్, అశోక్, శ్రీశైలం, ప్రవీణ్, ఎల్లం, భగవాన్, వెంకటేష్ ఉన్నారు.

ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం పరిహారం



రైతులతో మాట్లాడుతున్న ఆర్ఐలు

శివ్వంపేట(నర్సాపూర్): ట్రిబుల్‌ఆర్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం పరిహారం ఇవ్వడం జరుగుతుందని ఆర్ఐలు కిషన్, సునీల్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని పాంబండ గ్రామంలో భూములు కోల్పోతున్న రైతులతో సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. రోడ్డు కోసం గుర్తించిన భూముల్లో పొజిషిన్‌కు సంబంధించి రికార్డులో తప్పులు ఉన్నాయని, వాటిని సరిచేసి అసలైన రైతులకు మార్కెట్ ధర ప్రకారం పరిహారం ఇవ్వాలని కోరారు. ఈ విషయం గురించి ఉన్నతాధికారులను నివేదించి న్యాయం చేస్తామని వారు చెప్పారు.

గోపాల కాల్వల ఊరేగింపు



పాపన్నపేట(మెదక్): మండల కేంద్రం పాపన్నపేటలో ఆఖరి శ్రావణ సోమవారం సందర్భంగా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో గోపాల కాల్వలు(ఉట్టి కొట్టే) నిర్వహించారు. ఈశ్వరాలయంలో స్వామివారికి లింగాభిషేకం, నవగ్రహ పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని పురవీధుల్లో గోపాల కాల్వలు ఊరేగించారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం నాయకులు తూర్పు రాములు, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

వాన.. జనం హైరానా

కూలిన ఇళ్ల పరిశీలన • నిండుకుండలా వాగులు

జిల్లా వ్యాప్తంగా రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షంతో చెరువులు, కుంటలు నిండి, అలుగు పారుతున్నాయి. అలాగే ఆయా గ్రామాల్లో చాలా ఇళ్లు కూలిపోయాయి. దీంతో వాటిని అధికారులు సోమవారం పరిశీలించారు.



నిజాంపేటలో గర్శుల లక్ష్మి ఇంటిని పరిశీలిస్తున్న ఆర్ఐ గంగాధర్‌గౌడ్



శివ్వంపేట(నర్సాపూర్): ఎదుల్లాపూర్‌లో అలుగు పారుతున్న సింగయ్య చెరువు



పాపన్నపేట(మెదక్): దుర్గమ్మ ఆలయం వద్ద మంజీర పరవళ్లు



టేక్మాల్(మెదక్): గుండువాగు



కాడిపల్లి(నర్సాపూర్): వర్షంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతులు చేస్తున్న విద్యుత్ సిబ్బంది



టేక్మాల్(మెదక్): బొడ్మట్‌పల్లి పత్తి చేనులో చేరిన వర్షపునీరు



చిలప్‌చెడ్(నర్సాపూర్): చిట్కుల్ పాక్షికంగా కూలిన ఇంటిని పరిశీలిస్తున్న కార్యదర్శి తిరుపతి



వెల్దుర్తి(తూప్రాన్): ధ్వంసమైన ఇళ్ల వివరాలు సేకరిస్తున్న తహసీల్దార్, ఆర్ఐ



రామాయంపేట(మెదక్): లక్ష్మాపూర్‌లో కూలిన ఇల్లు



చేగుంట(తూప్రాన్): ఇబ్రహీంపూర్‌లో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న ఆర్ఐ నర్సింగ్ యాదవ్



పాపన్నపేట(మెదక్): అలుగు పారుతున్న కుర్తి వాడ చెరువు



కాడిపల్లి(నర్సాపూర్): పాఠశాల ఆవరణలో చేరిన నీటిలోనే వాలిబాల్ ఆడుతున్న యువకులు



పెద్దశంకరంపేట(మెదక్): కూలిన ఇళ్లను పరిశీలిస్తున్న అధికారులు

తృటిలో తప్పించుకున్న గిరిజన కుటుంబం



కోనాపూర్ తండాలో కూలిన ఇల్లు

రామాయంపేట(మెదక్): మండలంలోని కోనాపూర్ పెద్ద తండాలో భారీ వర్షాలకు ఒక ఇల్లు కూలడంతో అందులో ఉన్న గిరిజన కుటుంబం తృటిలో ప్రమాదం నుంచి బయటపడింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో తండాలో కేతావత్ మహేందర్‌కు చెందిన ఇల్లు కూలింది. అతడు తన తల్లి, భార్యాపిల్లలతో ఇంటిలో ఉండగా, అర్ధరాత్రి భారీ వర్షంతో బెంబేలెత్తిన ఆ కుటుంబం పక్కనే ఉన్న చిన్న గదిలో తలదాచుకుంది. వారు వెళ్లిన గంటలోనే ఇంటి గోడ కూలింది. ఇల్లు కూలి రోడ్డున పడ్డ తమ కుటుంబాన్ని ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఆలయాల్లో భక్తుల సందడి



పెద్దశంకరంపేట(మెదక్): పూజల్లో భక్తులు



నిజాంపేట(మెదక్): నందగోకుల్‌లో హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని కొప్పోల్ ఉమాసంగమేశ్వర దేవాలయం, జ్యోతిర్లింగ ఆలయాల్లో శ్రావణమాసం చివరి రోజు సోమవారం సందర్భంగా భక్తుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.

అమవాస్య పూజలు

రేగోడ్(మెదక్): మండలంలో సోమవారం అమవాస్య సందర్భంగా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దాతలు అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తుల రాకతో ఆలయాలు సందడిగా మారాయి.

మహంకాళి ఆలయంలో..

చేగుంట(తూప్రాన్): మండలంలోని మహంకాళి అమ్మవారి వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

టేక్మాల్(మెదక్): మండలంలోని బొడ్మట్‌పల్లి గుట్టపై వెలసిన భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో ఆలయ కమిటీ చైర్మన్ బస్వరాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చినుకులోనూ సంత



రంగంపేటలో ముసురులో అంగడి బజారు

కొల్చారం(నర్సాపూర్): రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిస్తున్న వర్షంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం రంగంపేట గ్రామంలో జరిగిన సంతలో మట్టి రోడ్లన్నీ బురదమయంగా మారాయి. దీంతో అడుగు తీసి అడుగు వేయని పరిస్థితులు ఉన్నాయి.

శతాధిక వృద్ధురాలు మృతి



ఎల్లమ్మ (ఫైల్)

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని కొర్విపల్లిలో శతాధిక వృద్ధురాలు వయోభారంతో సోమవారం మృతి చెందింది. కొర్విపల్లి గ్రామానికి సింగమెల్ల ఎల్లమ్మ(100) అనారోగ్యంతో మృతి చెందింది.

ఫలహారం బండి ఊరేగింపు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలోని మహంకాళి అమ్మవారికి ఊరేగింపు నిర్వహించే ఫలహారం బండిని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రారంభించారు. బీఆర్ఎస్ నాయకులు డిష్‌రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఫలహారం బండి ఊరేగింపులో హరీశ్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు నారాయణరెడ్డి మాజీ సర్పంచ్ శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

పార్కు స్థలాన్ని కాపాడండి



కలెక్టరేట్‌లో న్యాయం చేయాలని కోరుతున్న హమాలీ కాలనీవాసులు

మెదక్ కలెక్టరేట్: జిల్లా కేంద్రంలోని హమాలీ కాలనీలోని పార్కు స్థలాన్ని కబ్జా నుంచి కాపాడాలని కాలనీవాసులు కోరారు. సోమవారం అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ వాసులు ముత్యాలు, సిద్ధిరాంలు, మల్లయ్య, యాదగిరి, కిష్టయ్య, కాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఆర్థిక సాయం చేయరా ?

రేగోడ్(మెదక్): ఆర్థిక సాయం ఇప్పించాలని మండలంలోని ఆర్.ఇటిక్యాల గ్రామానికి చెందిన బాధిత రైతు కుటుంబ సభ్యుడు అశోక్ వెటర్నరీ అధికారులకు సోమవారం వినతిపత్రం అందజేశాడు. ఇటీవల కరెంట్ షాక్‌తో రూ.60వేల విలువ గల ఎద్దు మృతిచెందినట్లు ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.

◆ సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని అజ్జమర్రి గ్రామంలో నలుగురికి మాజీ ఎంపీటీసీ మల్లయ్య సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు.

గౌతోజీగూడెంలో..

మనోహరాబాద్(తూప్రాన్):మండలంలోని గౌతోజీగూడెం గ్రామానికి చెందిన నాగరాజుకి సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేసినట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు.

◆ కరాటే పోటీల్లో చిన్నారుల ప్రతిభ



తూప్రాన్: ఒపెన్ చాంపీయన్ షిప్ పోటీల్లో మండలానికి చెందిన 30 మంది చిన్నారులు ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించినట్లు కరాటే మాస్టార్ కాశీనాథ్ సోమవారం తెలిపారు. మేడ్చేల్ జిల్లా కండ్లకోయ వద్ద ఆదివారం నిర్వహించిన అండర్-16 ఒపెన్ చాంపీయన్ షిప్ పోటీల్లో మండలం నుంచి 30 మంది చిన్నారులు పాల్గొన్నట్లు తెలిపారు. వీరిలో 15 మందికి బంగారు, 10 మందికి సిల్వర్, 5 మందికి కాంస్య పతకం సాధించినట్లు కరాటే మాస్టార్ తెలిపారు.

◆ మండపాలకు అనుమతి తీసుకోవాలి

చిన్నశంకరంపేట(మెదక్): గణేశ్ మండప ఏర్పాటుకు నిర్వాహకులు అనుమతి తీసుకోవాలని ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఆన్‌లైన్ దరఖాస్తు ప్రతిని పోలీస్‌స్టేషన్‌లో అందించాలని కోరారు.

◆ రుణమాఫీ రైతుల వివరాల సేకరణ

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో రుణమాఫీ కానీ రైతుల వివరాలను ప్రత్యేక యాప్‌లో వ్యవసాయ అధికారులు నమోదు చేస్తున్నారు. సోమవారం వ్యవసాయ కార్యాలయానికి వచ్చిన రైతుల యాప్‌లో ఏఈఓలు నమోదు చేశారు. ఆధార్‌లో తప్పులు ఉండి రుణమాఫీ కాని రైతులు బ్యాంకులో సంప్రదించాలని ఇన్‌చార్జి ఏఓ కృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓలు మమత, వినీత్, అఖిల్‌హుస్సేన్ తదితరులు ఉన్నారు.

మహానేత వైఎస్సార్‌కు ఘన నివాళి

జిల్లా వ్యాప్తంగా సోమవారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి దివంగత మహానేత డాక్టర్ వైఎస్. రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు.



కాడిపల్లిలో నివాళులర్పిస్తున్న నాయకులు



నర్సాపూర్‌లో వైఎస్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



చేగుంటలో..



చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగిలో..

బగలాముఖీ శక్తిపీఠంలో విశేష పూజలు



బగలాముఖీ ఆలయంలో పూజలు చేస్తున్న పండితులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో కొలువైన బగలాముఖీ శక్తిపీఠంలో అమావాస్య సందర్భంగా సోమవారం విశేష పూజలు చేశారు. వేద పండితుడు, బగలాముఖీ ఉపసాకుడు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమం, హరిద్వార్చన, నిర్వహించారు. ముసురు వర్షంలో సైతం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ భూదాత రమేశ్ గుప్తా, నిర్వాహకులు సూర్యకుమార్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి



గడిపెద్దాపూర్ సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న దాదాయిపల్లి రైతులు

● సబ్‌స్టేషన్ ఎదుట రైతుల ఆందోళన

అల్లాదుర్గం(మెదక్): విద్యుత్ సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదని, త్రిఫేస్ కరెంట్ సక్రమంగా సరఫరా చేయడం లేదని ఆగ్రహించిన రైతులు సోమవారం గడిపెద్దాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. గడిపెద్దాపూర్ సబ్‌స్టేషన్ నుంచి టేక్మాల్ మండలంలోని దాదాయిపల్లి గ్రామానికి విద్యుత్ సరఫరా చేస్తారు. నెల రోజులుగా విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా మారడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా.. పట్టించుకోవడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. సబ్‌స్టేషన్ సిబ్బంది, విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. మూడు రోజులుగా త్రిఫేస్ కరెంట్ సరఫరా లేకపోవడంతో తాగునీటి కోసం తీవ్ర అవస్థలు పడాల్సి వస్తుందన్నారు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని రెతులు హెచ్చరించారు.